# సాంబయ్య చావలేదు

ఆ వేళ ఆదివారం. తలుపు వేసుకొని కథ వ్రాసుకొంటున్నాను. కథలో వ్యక్తి త్రాగుబోతు. అతని భార్య సహనం వ్యక్తీకరిస్తున్నాను. ఇంతలో తలుపు ధడ్ ధడమంటు నేఓ బాబు! అని ఒక వ్యక్తి ఆతృతగా పిలుస్తున్నాడు. లేచి తలుపుతీసాను. చవక బారు సారావాసన గుప్పుమని వేసింది.

"నువ్వు వస్తేగానీ కాదు ...రా....ర" ఆతృత పడుతున్నాడు మొదట వీడు త్రాగుతాడా అని ఆశ్చర్యం వేసి తరువాత త్రాగేవాళ్ళ తంతు యింతే అని నేను సావధానంగా యేమైందన్నాను.

"చంపుతాడట — వచ్చి తీర్పు చెప్పు!"

"నిన్నెవరూ చంపలేరు. వెళ్ళి హాయిగా పడుకో!"

ఈ మాటలు నోటనేవున్నాయి. నా చెయ్యి పట్టుకొని ముందుకు లాగుతూ "ఇదిగో యీ ప్రక్క వీధిలోనే మాయిల్లు.... నాది తప్పయితే నాకే నాలుగు చెప్పు దెబ్బలు వాయించు.... వాడిది తప్పయితే వాడికి నాలుగు వెయ్యి".

నే నింకేదో అనబోతుంటే అవకాశం యీయకుండా దండాలు పెట్టూ, పెద్ద గొంతుకతో బ్రతిమాలుతూ నన్ను వీధిలోకి వెంట నడిపించాడు. ఈ మనిషి పేరు నాకు తెలీదు. ఏం పనిచేస్తున్నాడో అంతకంటే తెలీదు. వీడూ నేను యిదివరకు మూడుసార్లే కలుసు కున్నాం....నాకు బాగా జ్ఞాపకంవుంది....మూడుసార్లే. మొదటి సారి: నేను బీచిలో ఒంటిగా సాయంత్రం కూర్చుని క్రుంగిపోతున్న దినకరుని వెలుతురు వస్తూన్న ఓడమీద పడ్తూంటే చూస్తున్నాను. వెనుకనుంచి "రూపాయితే" అని అరవగానే వెనుకకు తిరిగాను. అతుకులు వేసి మాసిపోయిన బట్టలతో యెత్తైన మనిషి కనిపిం చాడు. వయసు నలభై దాటే వుంటాయ్. కళ్ళు తీక్షణంగా వున్నాయి. క్రూరుడని ఆ ముఖమే అద్దంలా చెపుతోంది. నన్నొక అప్పు యెగగొట్టిన వాడిలా చూసి అడుగుతుంటే కొద్దిగా మనసు చివుక్కుమంది. ఆ మనిషివాటం చూడగానే యివ్వకపోతే నేగానీ నన్ను నానాతిప్పలు పెడ్తాడనే సందేహంతో జేబులో రూపాయి తీసి యిచ్చాను, వెళ్ళిపోయాడు.

రెండోసారి: మొదటి ఆట సినిమా చూసి యింటికి పోతు న్నాను. అంతదూరంనుంచే "బాబూ- బాబూ" అన్న కేకలు వినప డ్డాయి. అందరితో పాటు నేను వెనుకకు చూస్తాను. పరుగెత్తుకొస్తు న్నాడు. ఆగాను. డబ్బు అడిగితే యీ సారి లేదని చెప్దామని నిర్ధా రించుకున్నాను. నా దగ్గరగా వచ్చి సహజ గంభీర స్వరంతో "నీ

కోసం వారంరోజులై చూస్తున్నాను. వలవేసినా ఎక్కడా దొరికావు కావు. ఇదిగో.... యింద—ఆవేళ రూపాయి బదులిచ్చావు కదా." అంటూ నా చేతిలో అంతా చిల్లర పడవేసి "నా పెళ్ళాంకి మందు కొన్నాను. అవసరానికి యిచ్చావు. నిన్ను దేముడు బాగా చూస్తాడు!" అంటూ వెళ్ళిపోయాడు.

లెక్క పెట్టకండానే ఆ చిల్లర జేబులో వేసాను. మూడో సారి నాయింటి అరుగుమీద నన్ను చూసి వెళ్ళి పోతున్నవాడు "యిదేనా మీయిల్లు" అంటూ అరుగు మీద కూర్చున్నాడు. సిగరెట్ పెట్టి నా వేపు చూపించాడు.

" నే కాల్చను."

" నువ్వు మంచిపుట్టుక పుట్టావు అంచేత నీకు చెడ్డ అలవాట్లేమీ లేవు. నేను చాలా చెడ్డపుట్టుక పుట్టాను ..."

"నువ్వూ మంచి వాడివే—"

ఫక్కున నవ్వి లేచిపోతూ "నువ్వొక్కడివే అన్నావు నేను మంచివాడనని! నా సంగతి నీకు తెలీదు. ఆడు శెలవు మిలటరీనించి వస్తున్నాడు. ఆ ... మ వాళీ వెధవ....ఈసారి నాజోలికొస్తే పీక తెగేస్తాను."

"ఆడంటే నీకొడుకా?" అన్నాను.

ఆ మాట అనగానే తలూపి అక్కడనుంచి వస్తానని గబగబ వెళ్ళిపోయాడు. నేనింకా వాడిపేరూ, వృత్తీ యింకా యెన్నో విషయాలు కనుక్కుందా మనుకున్నాను గానీ మళ్ళీ అగపడలేదు.

ఈ నాల్గోసారి కలయికవరకు వీడు త్రాగుబోతని అనుకో

డానికి ఆస్కారం యిచ్చాడు కాదు. నామనసులో రెండోసారి కల యికనించీ యీ వ్యక్తి చాలా వున్నతంగా మెసలుతున్నాడు. ఈ అభిమానమే కొంతవరకు నన్ను వాడివెంట నడిపించింది.

ప్రక్కవీధి చివరలో చిన్న పెంకుటిల్లు—త్రేతాయుగంనాటి దిలా వుంది. తలుపు దడదడ బాదాడు. లోనుంచి పొమ్మని అరుపు, ఈ త్రాగబోతూ తలుపు తియ్యమని కొడుకును నానా తిట్లూతిట్టూ అరిచాడు. తలుపులు తెరవబడ్డాయి. నిప్పు ల్లాంటి కళ్ళతో చేతులు పాముల్లాలుగలా గిరగుతూ చెయ్యెత్తు జవాను యెదురయ్యాడు. తండ్రి అరిచాడు.

"గాడిదకొడకా! పెద్దమనిషిని తెచ్చాను. మర్యాదయియ్యరా!"

ఆ తీక్షణమైన కళ్ళు తొలిసారి దాగున్నట్టు ఒక మూల నున్న నా వేపు చూడగానే శాంతించినయ్.

"కూర్చోండి" అంటూ రెండు తలుపులు తెరిచి మూలనున్న చొట్టకుర్చీ ముందుకు లాగాడు. వెళ్ళికూర్చున్నాను. తండ్రి గొంతుక ఒక్కసారిగా "నా యెదురుగా పుట్టాడు గాడిద!... ఈ చేతులతో చర్మం వూడబీకేవాడినే....ఆ పిల్లి చూసావా ఆ కళ్ళు పులిలాగ— ఈ త్తి రౌడీవెధవై పోయాడు!"

కొడుకు కళ్ళు యీ మాటలతో మరీ యెరుపెక్కుతున్నాయ్ తండ్రిని ఆగమని సైగచేస్తూనే వున్నాను. అంతలో కొడుకన్నాడు "త్రాగున్నాడు. మరేం చెప్పినా వాడికి యెక్కదు!"

తండ్రి నా నోటిలో నోరు "హా" అంటూ వూది, "తాగాను. పొరపాటుమాట ఒక్కటంటే నీచెప్పు తీసి నన్ను కొట్టు....ఈ వెధవ నామీదా కళ్లెర్రజేస్తాడు? ఎన్ని గుండెలుండాలి?"

కొడుకు ముందుకొస్తూ "నీ బతుకెంతో నీమాటా అంతేలే.... నేను కాబట్టి యివన్నీ సహించుకొస్తున్నాను."

"పెద్ద పెద్దోలూ తాగుతున్నారు—నేను తాగుతున్నాను. నివ్వు కొత్తగా తాగిన వెధవలా మాటాడతురో...."

"నివ్వా....దున్నపోతువి.. నీతో నాకేం పని?" అంటూ కొడుకు వెనుకకు తిరిగాడు.

ఈమాట నాకు పెద్దది అనిపించి "మీరుకూడా మీ తండ్రిపరిస్థితికి వస్తున్నారా?" అన్నాను. కొడుకు ఆమాట వినగానే నా వేపు తిరిగాడు. ఆ యెర్రటి కళ్ళలో నీరు గిర్రున తిరిగిపోయాయి. నా దగ్గరగా వస్తూ "మీకు తెలీదండీ....నాకు జ్ఞానంవచ్చిన దగ్గరనించీ చూస్తున్నాను. ఒక వ్యసనంకాదు. బజారునిండా ముండలే. నన్ను చంపిననాన్నకళ్ళా పడ్డాను. నా కళ్ళతో మా అమ్మ ఒళ్ళంతా పిండి చేసిన్నాడు చేసిందిలేక సహించాను" ఇంతలో తండ్రి యేదో అడ్డువస్తున్నా వినుపించుకోక "ఇంతవాడ్నయ్యానా? ఇప్పొడూ నా యెదరగా మా అమ్మ యెముకలు విరగొట్టంటే చూస్తూ యెలా వూరుకోమంటారు?" అంటూనే బొలాబొలా కన్నీరు కార్చేస్తూ గబ గబ పెరటికివెళ్ళి తల్లి చెయ్యిపట్టుకొని లాగుకొనివచ్చాడు.

కొద్దిగా చాటుగా నిల్చున్నా నా కంటి కామె కనిపించింది. గాలేస్తే పడిపోయేటట్లుంది. ఆ వంచిన దుఃఖాన్వితమైన ముఖం చూడగానే నాకళ్ళల్లో నీరు చిమ్మింది. మాసిన బట్టలతో ఒక బిచ్చకత్తెలా వున్న ఆమెను, ఆ నమ్రతను, ఓర్పును చూసి నా శరీరమంతా ఒక్కసారి ఆవేశంతో పెల్లుబికి ఆమెను ఓదార్చుదామన్నంత కోరిక కలిగింది.

కొడుకు కళ్ళు తుడుచుకుంటూ "యింత చంపుతున్నా ఒక మాట యెదురాడదు....గొడ్డునుబాదినట్లు బాదితే మా అమ్మ మా కంటికి యింకెంత కాలం కనిపిస్తుందండీ? ఈ ప్రేమకైనా నేను నోచుకోవద్దా?"

ఆమె అక్కడనించి వెళ్ళిపోయింది. వెళ్ళిపోతూ ఆమె కళ్ళల్లో నీరు జారటం చూసాను. నా కథలో త్రాగుబోతు భార్య రూపు నా కంటికిప్పుడు అగపడింది. ఈలోగా తండ్రి యేదో పె గొంతుకతో అంటున్నాడు కానీ వినిపించుకోలేదు. తండ్రే నా వీపు మీద గట్టిగా తట్టూ "చెప్పు తప్పెవరిది?"

నా నోటి వెంబడి మాటరాలేదు. నన్ను కదుపుతూ "నేను తాగిన మాటలు ఆడలేదు. తప్పెవరిది? అన్నాడు.

"అసలు యీదెబ్బలాట యెలా వచ్చిందన్నాను. ఈ ప్రశ్న నేను యెలా వేశానో యెందుకు వేశానో నాకే తెలేదు.

"ఇంతసేపు చెప్పాను. చెముడుగాని వుందా? నా పెళ్ళాన్ని నేనేంచేసుకుంటే వాడికేం హక్కు వుందని?"

"నీ పెళ్ళంవాడితల్లి కదా." అన్నాను.

"బలే న్యాయం చెప్పావులే. నా తరవాత వాడా వాడి తర వాత నేనా దానికి?"

నేనేం సమాధానం చెప్పలేదు. మాటాడవేం అని రెట్టించాడు నేను లేచిపోతూ,

"ఇంత వయసువచ్చింది. కొంచం కోపం తగ్గించుకో. నిష్కా రణంగా అలాంటి మంచి మనిషిని హింసిస్తే నీకేం జయం?" అంటూ లేచాను. నా చెయ్యిపట్టుకొని "బాగా విను" అంటూ, నన్ను మళ్ళీ

కుర్చీమీద కూలదోసాడు. దుఃఖం వుద్రేకంతో సతమతమవుతూ యిటూ అటూ నడుస్తున్న కొడుకువేపు తిరిగాను. "ఉద్రేకంతో యే పని చెయ్యకండి తరవాత విచారిస్తారు. మీరు కూడా మీ తండ్రిలా కాలేరుగా!"

నేను, తండ్రికాదన్నా విడిపించుకొని బయలు దేరాను. కొడుకు నా వెనక గుమ్మంవరకువచ్చి "మీ సలహాకు కృతజ్ఞుడ్ని" అంటూ తలుపు గడియవేసుకుంటుంటే వెనుతిరిగి చూసాను. ఆ కళ్ళల్లో యింకా తడివుంది. ఆ ముఖంలో నిజంగా నాకేదో సంస్కారం అగపడింది. నేను కదులుతుంటుంటే తండ్రి గొంతుకే విని పిస్తోంది. నేను తిరిగివచ్చి ఆ ఆవేశంలోనే నా కథను పూర్తిచేసాను కథలో త్రాగుబోతు చాల హీనమైనచావు చచ్చిపోతాడు. అతని భార్యకు పట్టిన పీడ వదిలిందని యిక సుఖపడుతుందని యిరుగూ పొరుగూ అనుకుంటారు.

కథ వ్రాసానే గానీ నాకెందుకో అది యే సంచికకి పంపడా నికి మనస్కరించలేదు. కథ వ్రాసినంత సేపు నేను విమర్శకుడిని కాలేను. వ్రాసాకే నేను విమర్శకుడను, యెవరూ కోరి చెడ్డవార వడం హాస్యాస్పదంగా వుంటుంది. అగ్నిగుండమని తెలిసి యెవరూ అందులో దూకరు. ఏ పెనుగాలో అందులోనికి త్రోసి వెయ్యాలి. ఎన్నో విధాల ఆలోచించాను. ఇలా రోజులు గడిచి పోతున్నా నాలో ఆరాటమేగానీ నాకు నచ్చిన ముగింపు తట్టలేదు

ఒకరోజున పనిమీద ఆ వీధివెంబడి వెళిపోతుంటే "యేం బాబూ" అన్న పిలుపు వినపడింది. ఆ గొంతుగ త్రాగుబోతుదే. ముందూ వెనకా చూసాను. ఎక్కడా కనపడలేదు. నా కుడివేపు

త్రాగుబోతు యిల్లు వుంది. తెరచిన యింటితలుపులుద్వారా త్రాగుబోతు మంచంమీద కూర్చొని నన్ను పిలవటం గమనించాను. పెద్ద నవ్వుతో ఆహ్వానిస్తూ కుర్చీ చూపించాడు. నేను కూర్చొకుండానే కదలలేని ఆ మనిషి పరిస్థితిని చూస్తూ ఏమైందన్నాను?...."నీ కొడుకున్నాడా!" అన్నాను.

"శలవై పోయింది. పోయాడు" అన్నాడు. మొదటిప్రశ్నకు సమాధానం యివ్వలేదు.

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వేసిన ఆ యెడమకాలు వేపు చూస్తూ మళ్ళీ నా మొదటిప్రశ్న వేశాను.

"ఇదా! కాలు విరిగిపోయింది....అంతే!"

"బాగా త్రాగి యిల్లెక్కి గెంతావా! కాలవలోకి వురికావా!"

"ఆసుపత్రిలో కాలవలో పడ్డానని చెప్పానులే" తల ప్రక్కకు తిప్పిన తనను చూసి "అయితే నిజంగా పడలేదా?" అన్నాను.

నాముఖంలోనికి ఒకసారి చూసాడు. "నివ్వు చాలా మంచివాడివి" అంటూ అక్కడనించె "హా" అంటూ నోరు ఆవలించి "నేను త్రాగలే దిప్పుడు" అన్నాడు.

"నీ కాలెలా విరిగిం"దన్నాను. మళ్ళీ వాడి గొంతుక గంభీరమైంది. "నేను బ్రతికుండగా నా కొడుకు నను కొదంటాడా? నన్నేం పోషిస్తున్నాడా నామీద చెలాయించడానికి? ఉత్తి చేత కానివెధవ! కళ్ళెరచెయ్యటం తప్పించి యింకేమీ తెలీదు—చూడు వాడు చీమలాగుండే వాడు. చీమకుట్టినే చచ్చిపోతానా?"

"ఇంతకీ నీ కాలెలా విరిగింది?"

"వాడే పిరగ్గొట్టి యిల్లు వదిలిపోయాడు!"

ఈ విషయం నేను నమ్మాను. "నివ్వు యింత మంచివాడివి కదా తాగటం మానేకూడదూ!" ఈ త్రాగుడే యీచికాకు అంతటికీ కారణమని యీ సలహా యిచ్చాను.

"అదా మా నీమంటున్నావ్" అన్నాడు ఆశ్చర్యంగా.

"మానలేవా?"

"అదే నాకు కష్టాలో రచ్చించింది. ఏడుపులో నవ్వించింది- దానికీ నాకూ యేనాడో కుదిరిపోయింది. పొత్తు కలిసిపోయింది. అదే నాకు సుఖం యిస్తాది!"

"నీకూ విచారం వుందా?"

నా వేపు ఒకసారి నిదానించి చూచి తలదించాడు. "ఉంది" మళ్ళీ తలొకసారి ఆడించి "అవును—అందరికంటే నాది హెచ్చే!"

"నీ కెందుకు విచారం? ఎవరు పోయారని?'

వాడు తలెత్తాడు. ఆ కళ్ళల్లో నీరు పేరుకోవటం చూశాను. "నేనూ ఒకప్పుడు నీలాగే చాలా మంచివాడ్ని. అందుకే నిన్ను చూస్తే నాకెంతో అభిమానం! నీలో చచ్చిపోయిన నేనును చూస్తుంటాను."

"అయితే నివ్వెందు కిలా అయిపోయావ్?

"అంతా నాదే అనుకున్నాను. అంతా అదే అనుకున్నాను. అదే దేవతనుకున్నాను. దానినే నా పెళ్ళమని పిలిచాను. కొలిచాను కానీ నాకు —"

త్రాగుబోతు ఆవేశం అంతా కళ్లల్లో నీరై కారుతోంది.

మాటలు తడబడసాగాయి. గొంతుపట్టుక పోతోంది. ఖిన్న వదనంతో శోకస్వరంతో

"దాని నుంచే యిలా తయారయ్యాను-అనుకోకుండానే ఆ రోజునుంచి దానిని రోజూ చంపుతున్నాను. నేనిలా చంపుతున్నా మళ్ళీ ఆదేవతను తేగలనా? అది యెందుకు అనుభవిస్తూ బలవంతంగా చావకండా వుందో దానికే తెలియాలి!"

ఇప్పుడు నాకథకు ముగింపు తెలిసింది. నా కథలో అసలు సాంబయ్య చావలేదు.

(భారతి 1958)